ప్రజాశక్తి
సోమవారం 21 జులై 2025
5
పార్వతీపురం మన్యం

3 నుంచి జిల్లా స్థాయి యోగా పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ పార్వతీపురం మన్యం జిల్లా ఆధ్వర్యంలో ఆగస్టు 3న స్థానిక కలెక్టరేట్‌లో గల పిజిఆర్ఎస్‌సెల్ (గ్రీవెన్సెస్ సెల్, సెల్లార్)లో ఉదయం 8 గంటల నుంచి పోటీలు జరుగుతాయనియోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు మంచిపల్లి శ్రీరాములు, మోహన్ గంతాయత్ పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఏజ్ గ్రూపులు 10 -14, 14-18, 18-28, 28-35, 35-45, 45-55 వయస్సు గల పురుషులు/స్త్రీలు కేటగిరీల్లో నిర్వహించబడతాయన్నారు. ప్రతి అథ్లెటిక్ తన ఏజ్ గ్రూపులో రెండు ఈవెంట్స్‌లో మాత్రమే పాల్గొనేందుటకు అవకాశం ఉందన్నారు. ప్రవేశ రుసుం రూ.100 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు గౌరీశంకర్, 9866650998 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఆఖరు తేదీ ఈనెల 31 వరకు మాత్రమేనని పేర్కొన్నారు.

మంచం పట్టిన మన్యం

- పెరుగుతున్న వ్యాధులు
- ఒకే మంచం పై ఇద్దరు ముగ్గురు
- రోగులతో నిండుతున్న ఆసుపత్రులు

రోగులతో కిటకిటలాడుతున్న భద్రగిరి సిహెచ్‌సి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/సీతంపేట

ఏజెన్సీకి జ్వరం వచ్చింది.. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఏ గ్రామం చూసినా, ఏ ఆసుపత్రికి వెళ్లినా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. వర్షాకాలం కావడంతో దోమలు వ్యాప్తి కారణంగా అక్కడక్కడ మలేరియా, వైరల్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వైద్యం కోసం వస్తున్న రోగులతో ఆసుపత్రులు కిట కిటలాడుతున్నాయి. భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వివిధ రకాలైన వ్యాధులతో వైద్య పరీక్షల కోసం రోజుకు 150 పైగా ఓపి నమోదవుతుంది. రోగుల తాకిడి తగ్గినప్పటికీ వైరల్ జ్వరాలు నమోదవుతున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. 50 పడకల ఆసుపత్రిగా రూపాంతరం చెందినా రోగులకు సరిపడే మంచాలు లేకపోవడంతో ఒకే మంచంపై ఇద్దరికి వైద్యం అందిస్తున్నారు. వైద్యం పొందుతున్న వారిలో ఎక్కువమంది చిన్నారులే కనిపిస్తున్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, గిరిజనలు వైద్యం కోసం వస్తున్నారు. భద్రగిరిలో 12 మంది వైద్యులకు గానూ కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనం వినియోగంలో తేవడం ద్వారా అన్ని రకాల సేవలు అందుబాటు లోకి వస్తాయని ప్రజలు భావిస్తున్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలు లేకపోవడంతో విద్యార్థులకు స్థానికంగా వైద్యం అందడం లేదు. దీంతో చిన్నపాటి జ్వరం, తలనొప్పి వస్తే సమీపంలో ఉన్న హాస్పిటల్ కి వెళ్తున్నారు. అలాగే మండలంలోని తాడికొండ, రేగిడి, దుడ్డు ఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో రోగుల తాకిడి కనిపిస్తుంది. వైద్యం కోసం వస్తున్న గిరిజనులకు పూర్తిస్థాయి వైద్యం అందించకుండా మందులు ఇచ్చి పంపిస్తున్నారని ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధుల తెలిపారు. మూడు రోజుల పాటు ఆస్పత్రిలో ఉంచి వైద్యం అందించాలని కోరారు.

రోగులతో కిటకిటలాడిన ఏరియా ఆసుపత్రి

సీతంపేట : ఏజెన్సీలోని ప్రజలను జ్వరాలు విడిచి పెట్టడం లేదు. ప్రతి ఇంటిలో ఒకరిద్దరు జ్వరంతోనే మూలుగుతూనే ఉన్నారు. చుట్టుపక్కల పాఠశాల విద్యార్థులు కూడా జ్వరాల బారిన పడ్డారు. వర్షాలకు కొత్తనీరు, మరోపక్క ఎండల తీవ్రత అదే స్థాయిలో ఉండడంతో మలేరియా, వైరల్ జ్వరాలు చాప కింద నీరులా వ్యాప్తి చెందుతున్నాయి. మండలంలోని పెద్దకంబకు చెందిన ఎన్.శాంతికుమారి, చాపరాయిగూడకు చెందిన బుచ్చమ్మ, రేగులగూడకు చెందిన కె.పద్మావతి, గడ్డికారెంకు చెందిన కె.గిరి మలేరియా జ్వరంతో చికిత్స పొందుతున్నారు. అలాగే పూతికవలస, ఈతమానుగూడ, గడిగుజ్జి ,జోనగ దిసరిగూడ, గడ్డి కారేం, ఘాటి గుమ్మడ, తలేబు గూడ తదితర గిరిజన గ్రామాల్లో గిరిజనులు జ్వరాలతో బాధపడుతూ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు.

సీతంపేట ఏరియా ఆసుపత్రిలో రోజుకు 350 పైగా ఒపి ఉన్నప్పటికీ వీటిలో కనీసం 90 వరకు వైరల్ జ్వరాలతో బాధపడుతూ ఉంటారు. అంతేకాకుండా సుమారు 20 మంది వరకు మలేరియా అనుమానిత కేసులు నమోదవుతున్నాయి. గత నెల ఇన్‌పేషెంట్లు ఏరియా ఆసుపత్రిలో 1100 పైగా వస్తే ఈనెల మరింత ఎక్కువ రావచ్చని వైద్యులు అంచనాలు వేస్తున్నారు. ఇదే సీజన్లో గత ఏడాది నెలకు 700 మించి ఇన్ పేషెంట్లు ఉండేవారు కాదు. దీన్నిబట్టి చూస్తే జ్వరాలు తీవ్రత ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏరియా ఆసుపత్రిలో పిల్లలు వార్డు ఒకటే ఉండగా, అందులో బెడ్ 20 ఉన్నాయి. ఈ మూడు రోజుల్లో 39 మంది చిన్నారులకు పిల్లల వార్డులో అడ్మిట్ అవ్వగా, దీనిలో 27 మంది మలేరియాతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఆదివారం ఎనిమిది మంది పిల్లలు మలేరియా సోకినట్లు గుర్తించారు. అయితే ఇప్పటికే పిల్లల వార్డు చాలా పోవడంతో మహిళా వార్డుకు కొంతమంది పిల్లలను పంపించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యసదుపాయాలు కల్పించి, మౌలిక సదుపాయాలు అందించాలని గిరిజనులు కోరుతున్నారు.

దోమ తెరలు పంపిణీ చేయాలి

గిరిజనులు మలేరియా దోమ కాటు నుంచి రక్షణ పొందడానికి ప్రభుత్వం దోమ తెరలు పంపిణీ చేయాలి. దోమల కాటు వల్ల మలేరియా, డెంగీ వ్యాధులు బారిన పడుతున్నారు. గ్రామాల్లో స్ప్రేయింగ్ చేసేటప్పుడు ముందస్తుగా సమాచారం ఇవ్వాలి. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులను నియమించి మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలి.

మండంగి రమణ,
ఎంపిటిసి, చెముడు గూడ.

మెరుగైన సేవలు అందిస్తున్నాం

భద్రగిరి ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వస్తున్న రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. వారం రోజులుగా ఒపి తగ్గింది. వైరల్ జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

రౌతు రవికుమార్,
వైద్యులు, భద్రగిరి సిహెచ్‌సి.

సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారు

ఈ ఏడాది జ్వరాలు ఎక్కువ

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జ్వరాలు అధికంగా వస్తున్నాయి. ఇప్పటికే వచ్చిన రోగులకు వెంటనే వైద్యమందిస్తున్నాం. పిల్లల వార్డులో 20 బెడ్‌లు ఉండడంతో మిగతా పిల్లలను ఎన్ఆర్‌సి, వార్డ్ ఫిమేల్ వార్డులో మిగతా పిల్లలను చేర్పించి వైద్యం అందిస్తున్నాం.

బి.శ్రీనివాసరావు,
సూపరింటెండెంట్,
సీతంపేట ప్రాంతీయ ఆసుపత్రి.

యూరియా పూర్తి స్థాయిలో అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంగునాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని రైతులందరికీ సరిపడా యూరియా అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్లో విలేరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో యూరియా కొరత చాలా తీవ్రంగా ఉందని, దీంతో రైతులు పనులు మానుకొని మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. నాట్లు వేసిన వారం రోజుల్లోపు యూరియా (నత్రజని) అందించాలని వ్యయసాయాధికారులు సలహాలు ఇస్తున్నారని, అయితే జిల్లాలో గత 15 రోజులుగా నాట్లు జరుగుతున్నా ఎరువులు మాత్రం అందుబాటులో లేవని అన్నారు. విస్తారంగా వర్షాలు పడుతున్నాయని, రైతులకు యూరియా, మిగతా ఎరువులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బ్లాక్ మార్కెట్లో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని అన్నారు. సకాలంలో యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నేరుగా సచివాలయాల వద్ద ఎరువులు అందించే వారిని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎరువులకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లాలో గల మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందించి ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసి రైతులకు సరిపడా ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయాధికారులు జిల్లాలో ఇంతవరకు రైతులకు ఇచ్చిన ఎరువులు ఎంత, వాటిలో యూరియా శాతం ఎంత అనేది స్పష్టం చేయాలని కోరారు. జిల్లాలో రైతులందరికీ ఎంత యూరియా అవసరం, మిగిలిన ఎరువులు ఏ మేరకు అవసరం అనేది పత్రికా ముఖంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో యూరియాతో పాటు ఇతర ఎరువుల కొరత లేకుండా , దిగుబడులు తగ్గకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులను కదిలించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు పాల్గొన్నారు.

గుండెపోటుతో పోలీస్ గార్డు మృతి

ప్రజాశక్తి - కొమరాడ

రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా గుండెల్లో నొప్పి రావడంతో పోలీసు గార్డు కుప్పకూలిపోయిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం కొమరాడ పోలీస్ స్టేషన్లో గార్డుగా విధులు నిర్వహిస్తున్న జన్ని గణప్రసాద్ (41) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. గుమ్మలక్ష్మీపురానికి చెందిన జన్ని గణప్రసాద్ సివిల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎఆర్ కానిస్టేబుల్ నుంచి గార్డ్‌గా కొమరాడ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే శనివారం రాత్రి డ్యూటీ సమయానికి విధులకు హాజరైన గణప్రసాద్ రాత్రి సమయంలో ఒక్కసారిగా గుండెలో నొప్పి వచ్చి కింద కుప్పకూలిపోయాడు. విషయాన్ని గమనించిన తోటి పోలీస్ సిబ్బంది 108 వాహనానికి సమాచారం ఇచ్చి పార్వతీపురం తరలిస్తుండుగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు డిప్లొమా, మరో కుమారుడు 9వ తరగతి చదువుతున్నట్లు స్థానిక సిబ్బంది తెలిపారు. గణప్రసాద్ మృతి పట్ల స్థానిక ఎస్సై కె.నీలకంఠం, సిబ్బంది ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు.

కానరాని పారిశుధ్య పక్షోత్సవాలు

మూలన పడిన కాంపెక్టర్ వాహనాలు
పనులు చేయలేమని చేతులెత్తేసిన కార్మికులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పారిశుధ్య వారోత్సవాలు స్థానిక మున్సిపాల్టీలో కానరావడం లేదు. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పట్టణంలో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా చెత్తను తరలించేందుకు వినియోగించిన రెండుకాంపెక్టర్ వాహనాలు కొన్ని నెలలుగా మూలకు చేరినా వాటిని మరమ్మతులను పట్టించుకొనే నాథుడే లేడు. దీనివల్ల పారిశుధ్య కార్మికులకు పట్టణంలో ప్రతిరోజు జరిగే పారిశుధ్య నిర్వహణ, చెత్త తరలింపు కష్టంగా మారుతోంది. ఈనెల 16 నుంచి 30వరకు పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో స్థానిక మున్సిపాలిటీలో ఈ పక్షోత్సవాలను ఎక్కడా నిర్వహించిన దాఖలాల్లేవు. మున్సిపల్ కార్యాలయం వెనుక కొన్ని నెలలుగా చెత్తలను డంపింగ్ యార్డ్‌కు తరలించే కాంపెక్టర్ వాహనాలు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. ఈ వాహనాలను మరమ్మతులు చేసేందుకు ఇటు మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, అటు ప్రజారోగ్య విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పారిశుధ్య నిర్వహణ పనులు చేసేందుకు, చెత్తను తరలించేందుకు పారిశుధ్య కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. వీటికి మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులు పలుమార్లు మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ, ఆ వాహనాలకు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టకపోవడం వల్ల పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు 30 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పడకేసి తూతూ మంత్రంగా పనులు జరుగుతుంది. మరికొన్ని రోజుల్లో వర్షాలు విస్తారంగా పడే అవకాశం ఉన్నందున, ముంపునకు గురయ్యే శివారు ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ జరిగే అవకాశం ఉండదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని, యుద్ధ ప్రాతిపదికన వీటికి మరమ్మతులు చేయించేందుకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, మున్సిపల్ పాలకవర్గం దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రెడ్డివీధి జంక్షన్లో పేరుకుపోయిన చెత్త కుప్ప

మరమ్మతులకు గురై మూలకు చేరి కంపెక్టర్ వాహనాలు

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలోని ఎస్‌టి బాలుర కళాశాల వసతి గృహం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు మాట్లాడుతూ పట్టణంలో పోస్ట్ మెట్రిక్ బాయ్స్ హాస్టల్‌లో మరుగుదొడ్లు బాగో లేక హాస్టల్ బయటకు విద్యార్థులు వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. చుట్టూ ప్రహరీ లేకపోవడం వల్ల విషసర్పాలు కూడా వస్తున్నాయని, విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇటీవల కలెక్టరేట్ వద్ద ధర్నాలో జిల్లాలోని సమస్యలపై ఉన్నత అధికారులతో చర్చించగా పరిష్కారం చేస్తామని జాయింట్ కలెక్టర్ చెప్పారని తెలిపారు. కానీ సంబంధిత అధికారులు హాస్టళ్లకు వెళ్లి పర్యవేక్షణ చేయడం లేదని, తక్షణమే సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేసి హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున భవిష్యత్తులో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు టి.అఖిల్ మాట్లాడుతూ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, కిటికీలకు మెస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని లేనిచో భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సింహాచలం, పట్టణ కమిటీ సభ్యులు కె.రాజేష్, గణేష్, కృష్ణ, శ్రీను, రాహుల్, బొంజెయ్, పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు

అఖిల భారత మహాసభను జయప్రదం చేయండి: సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈ ఏడాది డిసెంబర్ 31, జనవరి 1- 4 తేదీల్లో విశాఖపట్నంలో జరుగు సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి రమణరావు, వై.మన్మధరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సిఐటియు అనుబంధ రంగాల కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో కార్మిక వర్గం అనేక సమస్యలు ఎదుర్కొంటుందని, ఈ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకు కార్మిక వర్గం హక్కులను హరించేందుకు ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్ర భాగానికి నిలిచిందని తెలిపారు. దేశంలో వివిధ రంగాల కార్మిక సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు సిఐటియు ఆలిండియా మహాసభలు దోహదపడతాయని తెలిపారు. ఈ మహాసభలకు ముందుగా రాష్ట్ర, జిల్లా మహాసభలు నిర్వహించనున్నామని అందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా మహాసభలు సెప్టెంబరు 13 ,14 తేదీల్లో పాలకొండలో జరుగుతాయని చెప్పారు. ఈ జిల్లా మహాసభలను కూడా జిల్లాలోని కార్మిక వర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శు బివి రమణ, ఎన్‌వై నాయుడు, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, శాంతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.ఉమామహేశ్వరి, జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి మన్మధరావు

నెలాఖరులోగా ఇకెవైసి చేయించుకోవాలి

కొత్త రేషన్‌కార్డులకు 2260 దరఖాస్తులు
'ప్రజాశక్తి'తో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ కె.శ్రీనివాసరావు ముఖాముఖి

జిల్లాలోని రేషన్ కార్డులలు ఉన్న లబ్ధిదారులంతా ఈనెలాఖరులోగా ఇకెవైసి చేయించుకోవాలని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ కె.శ్రీనివాసరావు చెప్పారు. జిల్లా జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం 2260 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. బ్యాంకు ఖాతాలతో ఆధార్ అనుసంధానం లేనివారికి ఉచిత గ్యాస్ సిలండర్ల నగదు జమకావడంలేదన్నారు. అలాగే జిల్లాలో చేపడుతున్న పౌరసరఫరా గురించి మరిన్ని విరాలను 'ప్రజాశక్తి'తో ఆయన ముఖాముఖి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....
-ప్రజాశక్తి, పార్వతీపురం

◆ **జిల్లాలో కొత్త రేషన్ కార్డులకు ఎన్ని దరఖాస్తులొచ్చాయి? ఎప్పుడు ఇస్తారు?**

జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం 2260 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1515మంది అర్హత సాధించారు. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే రేషన్ కార్డుల మంజూరు ప్రారంభమవుతుంది.

◆ **రేషన్ కార్డులు మార్చే అవకాశం వుందా?**

ఇప్పుడున్న రేషన్ కార్డులు మార్చే అవకాశం ఉంది. ఎటిఎం కార్డు సైజ్‌లో క్యూఆర్ కోడ్‌తో కొత్త రేషన్ కార్డులు పంపిణీ కానున్నాయి. ఈనెలాఖరులోగా రేషన్ కార్డులో సభ్యులంతా ఇకెవైసి చేయించుకోవాలి. కుటుంబంలో మరణించిన వారి పేర్లు, వివాహాలై వెళ్ళిపోయిన కూతుర్లు, కొడుకుల పేర్లు తొలగింపు జరుగుతుంది.

◆ **జిల్లాలో ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులు ఎన్ని?**

జిల్లాలో మొత్తం బిపిఎల్ రేషన్ కార్డులు 2,22,033.వీటిలో అంత్యోదయ కార్డులు 54,930.

◆ **ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం కింద డబ్బులు అందడం లేదనే ఆరోపణలపై అభిప్రాయం ఏమిటి?**

మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం కింద అర్హులైన వారందరికీ నగదు బదిలీ జరుగుతోంది. బ్యాంక్ అకౌంట్, ఆధార్ అనుసంధానం లేకపోతే నగదు బదిలీ జరగదు. జిల్లాలో లక్షా 33వేల 777మందికి ఈ పథకం కింద లబ్ధి చేకూరుతుంది. గత ఏడాది నవంబర్ నుంచి మార్చి వరకు 1,62,109 మందికి రూ.12కోట్ల 3లక్షల 69వేల 206 ఖాతాల్లో జమ అయ్యాయి. రెండో విడతలో ఏప్రిల్ నుంచి నేటి వరకు 1,33,777మందికి 10కోట్ల 56లక్షల 85వేల 865 రూపాయల నగదు బదిలీ జరుగుతోంది. 564మందికి బ్యాంక్ ఖాతాలతో ఆధార్ అనుసంధానం లేక సబ్సిడీ జమ కాలేదు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ అర్జీలు నమోదు

ప్రజాశక్తి - పార్వతీపురం

మీకోసం వెబ్సైట్‌లోనూ అర్జీలు నమోదు చేయవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు సెల్లార్‌లో ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. పిజిఆర్ఎస్ వివరాలు 1100 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్సైట్ లోనూ నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

సమావేశంలో పాల్గొన్న గిరిజన సంఘాల నాయకులు

ఆదివాసీ దినోత్సవంపై గిరిజన సంఘ నాయకుల సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై గిరిజన సంఘాల నాయకులు స్థానిక వైటిసిలో ఆదివారం సమావేశమయ్యారు. ఆదివాసీల సాంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ దినోత్సవం ఈ ఏడాది ఘనంగా నిర్వహించాలని ప్రథమ సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ చేశారు. తదుపరి సమావేశంలో సన్నాహక కార్యక్రమంపై చర్చించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, ఆదివాసీ గిరిజన హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు మండంగి రమణ, ఎన్ శేఖర్, మండంగి శ్రీను, పత్తిక ప్రసాద్, పత్తిక శంకర్ రావు,తోయక నాగ భూషణ, పువ్వల తిరుపతి తదితరులు ఉన్నారు.

పంచాయతీ అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సర్పంచి ఆర్ చైతన్య స్రవంతి తెలిపారు. పంచాయతీ పరిధిలో గల పాత జెకె పాడులో విద్యుత్ దీపాలు దగ్గరుండి వేయించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యగా పారిశుధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ ప్రజలకు పుష్కలమైన తాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

రోడ్డుకు వేసుకుంటున్న గిరిజనులు

చేయి చేయి కలిపి రహదారి బాగు చేసుకొని...

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని రేగులగూడ బ్రిడ్జి కూలిపోయి ఏళ్ల గడుస్తున్నా పూర్తి కాకపోవడంతో వేరే రహదారిని చూసుకొని బురదగా ఉండడంతో బాగా చేసుకుని అత్యవసర సమయంలో గమ్యానికి చేరుకోవాలని ఆ రెండు గ్రామాల గిరిజనులు ఇంటింటికీ చందా వేసుకొని చేయి చేయి కలిపి శ్రమదానంతో రహదారిని బాగు చేసుకున్నారు. దీంతో రేగులగూడ కాలనీ నుంచి పాతరేగులగూడ వరకు బురదమయంగా ఉన్న చెరువు గట్టుపై రోడ్డును కనీస రాకపోకల కోసం రెండు గ్రామస్తులు కలిసి కట్టుగా చందాలు వేసుకుని రోడ్డు వేసుకున్నట్టు గ్రామస్తులు రాజ్ కుమార్, రమేష్ తెలిపారు.

నిరసన తెలుపుతున్న గిరిజనులు

అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కోడికాలవలస గిరిజనులు సాగు చేస్తున్న అటవీ పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కోడి కాలువలస వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. పెద్దగెడ్డ జలాశయం వల్ల భూములు, ఇళ్లను కోల్పోయిన గిరిజన రైతులు అటవీ పోడు భూములకు పట్టాలు మంజూరు చేయకపోవడం వల్ల ప్రభుత్వ రాయితీలుకు దూరమవుతున్నారని అన్నారు. పట్టాలు మంజూరు చేసినట్లయితే ప్రభుత్వం నుంచి వచ్చిన రుణాలు, పంట నష్టాలు వచ్చి కొంత వరకు అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని అన్నారు. సాగు చేస్తున్న 30 కుటుంబాలకు సంబంధించిన గిరిజనులందరికీ పట్టాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఫ్లై ఓవర్‌పై గజానికొక గొయ్యి

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం ఫ్లై ఓవర్ పై గజానికి ఒక గొయ్యిలో ఉండడం వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హనుమాన్ జంక్షన్ నుంచి అప్పయ్యపేట రైల్వే స్టేషన్ వరకు వెళ్లే మార్గంలో ఎక్కడికక్కడ గోతులు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో వర్షాలు కురిసే సమయంలో గొంతుల్లో నీరు చేరి వాహనదారులకు కనపడక ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లలు. ఈ రహదారి గుండా మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లాస్థాయి అధికారులు నిత్యం ప్రయాణిస్తూనే ఉంటారు. కానీ ఏ ఒక్కరూ ఈ సమస్యను పట్టించుకునే దాఖలాల్లేవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఫ్లై ఓవర్ పై నిర్మించిన విద్యుత్ లైట్లు గత నాలుగేళ్లుగా మరమ్మతులకు గురైనా పట్టించుకోలేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురై మరణించిన సంఘటనలు అనేకం. ఈ సమస్యలపై పలుమార్లు పలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందించే నాధుడే కరువు. ఇప్పటికైనా పాలకులు, ఆర్ అండ్ బి, విద్యుత్‌శాఖల అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ బ్రిడిపై గోతులను పూడ్చి, లైట్లు ఏర్పాటు చేసి చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.


ఫ్లైఓవటర్ బ్రిడ్జిపై ఏర్పడ్డ భారీ గొయ్యి

ఆందోళన చేస్తున్న అద్దెబస్సు డ్రైవర్లు

అద్దె బస్ డ్రైవర్ల జీతాలు వెంటనే పెంచాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉమ్మడి జిల్లా పరిధిలో గల సాలూరు, విజయనగరం, పార్వతీపురం, ఎస్.కోట డిపోల పరిధిలో ఉన్న అద్దె బస్సు డ్రైవర్ల జీతాలను వెంటనే పెంచాలని డిమాండ్ చేస్తూ ఆదివారం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద అద్దె బస్సు డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ నిరసనలో పాల్గొన్న అద్దె బస్సు డ్రైవర్ల సంఘం గౌరవ అధ్యక్షులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ ఎపిఎస్ ఆర్‌టిసిలో బస్సు డ్రైవర్లతో బస్సు యాజమానులు, సంస్థ వెట్టి చాకిరీ చేయించుకుంటుందని వారికి కష్టానికి తగ్గ ప్రతిఫలాన్ని ఇవ్వడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి అద్దె బస్సు డ్రైవర్లకు పల్లె వెలుగుకు రూ.19500, ఎక్స్ప్రెస్ సర్వీసులకు రూ.24000 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అద్దె బస్సు డ్రైవర్లుగా ఒప్పందం కుదుర్చుకున్న ఆ ఒప్పందం అమలు చేయకపోవడం వల్ల ఏళ్ల తరబడి పాత జీతాలతోనే కార్మికులు కుటుంబాలను పోషిస్తున్నారని అన్నారు. దీనివల్ల పెరిగిన ధరలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి కార్మిక కుటుంబాల్లో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అద్దె బస్ డ్రైవర్లకు కనీసం ఏడాదికి రెండు జతల యూనిఫారా యాజమాన్యాలు ఇవ్వకపోతే ఆర్టీసీ అధికారులు కానీ, లేబర్ అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఇప్పటికే పార్వతీపురం ఆర్టీసీ డిపోలో అద్దె బస్ డ్రైవర్లు సంఘం ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ ఇచ్చి ఆందోళన చేస్తున్నారని, యాజమాన్యాల మొండి కార్మికులకు అన్యాయం చేయడమే అవుతుందని తెలిపారు. ఈ విషయమై ఆర్టీసీ జిల్లా రాష్ట్ర అధికారులు వెంటనే అద్దె బస్సు యజమానులకు వేతనాలు పెంచేలా సూచనలు చేయాలని, గత కొంతకాలంగా అద్దె బస్సు డ్రైవర్ల సమస్యల గురించి పోరాడుతున్న పార్వతీపురం, విజయనగరం డిపో కార్మికులకు సాలూరు డిపో తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అద్దె బస్ డ్రైవర్ల సంఘం నాయకులు ఎం.శ్రీను, వై వెంకటి, సత్యనారా యణ, కె.శ్రీను, హర్ష, సుధీర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పార్వతీపురం మన్యం జిల్లాలో పలు గిరిజన సమస్యలను సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి.. ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు దృష్టికి తీసుకొచ్చారు. విజయనగరంలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం కృష్ణమూర్తి.. ఆయన్ను కలిసి ఏజెన్సీలోని పలు సమస్యలను వివరించారు. కురుపాం నియోజకవర్గంతోపాటు ఇతర ఏజెన్సీ ప్రాంతాలలో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు కొరవడిన పరిస్థితులున్నాయని తెలిపారు. నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదని చెప్పారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు వైద్యం సహాయం పొందేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, రహదారి సౌకర్యం లేనందున ఇబ్బందులు పడుతున్నారని కృష్ణమూర్తి తెలిపారు. కమిషన్ ఛైర్మన్ శంకరరావు స్పందిస్తూ ఏజెన్సీ ప్రాంతాల సమస్యలను తమ క్షేత్ర స్థాయి పర్యటనలో గుర్తించి ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ఛైర్మన్‌కు వినతి అందిస్తున్న కృష్ణమూర్తి

గిరిజన గ్రామాల్లో 'సుపరిపాలన తొలి అడుగు'

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గుజ్జుపాడు, సంగెడ్డ, గొందిలోవ, సింగుపురం గిరిజన గ్రామాల్లో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గూర్చి ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జ్ సుకేష్ చంద్ర పండా, కో - క్లస్టర్ సువ్వాన గోవిందరావు, మాజీ ఎంపిటిసి శెట్టి చంద్రరావు, మాజీ సర్పంచ్ నిమ్మక మహేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండ పంచాయతీ ఎగువ తాడికొండలో ఆదివారం బూత్ నెంబర్ 81 సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, బూత్ ఇంచార్జిలు త్రినాథ్, వేణు, నాయకులు జయంత్,

కురుపాంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

శ్రీహరి, శివ, చంటి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తామరకండిలో ....

సీతానగరం : మండలంలోని తామరకండి, పెదబోగిలిలో ఆదివారం సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం కరపత్రాలను ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం నాయకులు ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత పెన్షన్లు పెంచాలని, సూపర్ సిక్స్ అమలు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుడితి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు శ్రీరాములు నాయుడు, వెంకటరమణ, సర్పంచ్ ఎం.వెంకటనాయుడుతో పాటు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

సీతానగరం: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే బి.విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని జోగింపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలన్నారు.ఆట స్థలాన్ని పరిశీలించి దాన్ని చదును చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు, టిడిపి నాయకులు బి.లక్ష్మణరావు, కె.అరవింద్ కుమార్, పాల్గొన్నారు.

దబ్బగెడ్డ, గొడేవలసలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - మక్కువ

సత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యాన మండలంలోని దబ్బగెడ్డ, గొడేవలసలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారులు శకుంతల, ప్రభాకర్ రోగులకు వైద్యపరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే 150 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా ఎనిమిక్ రోగులను గుర్తించారు. అలాగే దెబ్బగెడ్డలో ప్రజలు ఎక్కువగా చికెన్ గున్యాతో బాధపడుతున్నట్టు గుర్తించారు. అలాగే సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు పి.నేతాజీ నాయుడు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ పి.రాజశేఖర్, జోనల్ కన్వీనర్ జి.సత్యనారాయణ, వివిధ సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

నవధాన్యాల సాగుతో పొగాకు పంట ప్రయోగం

ప్రజాశక్తి -పాచిపెంట

నవధాన్యాలు ఎన్ని ఎక్కువగా రకాలు వేస్తే అంత ఎక్కువగా నేల సారవంతమవుతుందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. 30 నుంచి 40 రకాల విత్తనాలు ఒక ఎకరానికి 25 కిలోలకు పైగా వేసుకుంటే కలుపు మొలకెత్తదని, అంతేకాకుండా అనేక రకాల పంటల విత్తన వేరు వ్యవస్థలు నేలలో ఉండడం వల్ల పలు రకాల సూక్ష్మజీవులు వేరు వ్యవస్థ చుట్టూ చేరి జీవ ద్రవ్యాన్ని ఏర్పరచి పంటలకు కావాల్సిన అన్ని పోషకాలను అందిస్తుందని తెలిపారు. మండలంలోని తాడూరులో సిఆర్‌పి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో రైతు యాసర్ల ఈశ్వరరావు మూడు ఎకరాల క్షేత్రంలోనూ, బోను లోకేష్ రెండు ఎకరాల క్షేత్రంలో నవధాన్యాల సాగు తర్వాత పొగాకు పంట వేసుకుంటే వచ్చే ఫలితాలను అంచనా వేయడానికి 32 రకాల విత్తనాలు ఎకరానికి 25 కిలోలు చొప్పున చల్లించే ప్రయోగంలో పాల్గొన్నారు. ఈ నవధాన్యాలను 45 రోజుల తర్వాత కలియదున్ని పొగాకు పంట వేసుకుంటే ఆకు నాణ్యత పెంపు, చీడపీడలు తట్టుకునే పరిస్థితి, ఉపయోగకర కీటకాలు, నేలలో సేంద్రియ పదార్థం పెరిగే అంశాలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ఈ విధానాలను వాణిజ్య పంటలైన మొక్కజొన్న, పత్తి, అరటి, కంద వంటి పంటలకు ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ఆవులు ఉన్న రైతులు 40 రోజులు తర్వాత ఈ నవధాన్యాల్లో విడిచిపెడితే పశుగ్రాసం తినడం వల్ల పాలు, వెన్న శాతం పెరగడమే కాకుండా పశువులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరే అవకాశం ఉందని తెలిపారు. కావున రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య ఎంటి యశోదమ్మ పాల్గొన్నారు.

సీతాఫలాలకు మార్కెట్ ధర లేక విలవిల

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులు ఆరుగాలం శ్రమించి సేకరించిన ఉత్పత్తులకు మార్కెట్‌లో ధర పలకపోవడంతో గిరిజనుల ఆందోళన చెందుతున్నారు. గిరిజన ఉత్పత్తుల్లో సీతాఫలాలు ఒకటి అని చెప్పవచ్చు. ఏజెన్సీలో ఎటువంటి రసాయనాల్లేకుండా ప్రకృతి సహజ సిద్ధంతో పండిన పంట సీతాఫలాలు. వీటిని మధుర ఫలాలని కూడా పిలుస్తారు. వీటిలో అధికంగా పోషకాలు ఉంటాయి. వీటిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తినాలని వైద్యులు కూడా సూచిస్తున్నారు. సీతంపేట ఏజెన్సీలో సీతాఫలాలు సుమారు 5వేల ఎకరాల వరకు పంట కాపు ఉంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వాతావరణం మార్పులు వల్ల దిగుబడి తగ్గింది. జూలై రెండో వారం, అక్టోబర్ మొదటి వారంలో సీతాఫలాలు పంట వస్తుంది. ఏడాదికి రెండు కాపు వస్తుంది. సీతంపేట ఏజెన్సీలో కుసిమి, శంభాం, కోతాం, మర్రిపాడు, పూతికవలస, దోనుబాయి, పొల్ల, జోనగ దిసరిగూడ, తదితర ప్రాంతాల నుంచి ఆది, సోమవారం సీతంపేట సంతకు, శనివారం కుసిమి సంతకు, బుధవారం మర్రిపాడు సంతకు, శుక్రవారం పూతిక వలస సంతకు సీతాఫలాలు తెచ్చి విక్రయిస్తారు. గత ఏడాది సుమారు 10 కేజీల సంచి సీతాఫలాలు రూ.600 నుంచి రూ.700 వరకు పలికితే ఈ ఏడాది రూ.300కే పలుకుతుంది. పంట దిగుబడితో పాటు ధర కూడా తగ్గిందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. సీతాఫలాల ధర మొదటి వారంలోనే ఇలా తక్కువ ధర ఉంటే సీజన్ చివరిలో మరింత ధర పడిపోయే ప్రమాదం ఉందని గిరిజనులు వాపోతు న్నారు. ఇదే అదునుగా దళారీలు తక్కువ ధరకు విక్రయించి, మైదాన ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

సంచులతో మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన సీతాఫలాలు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గ్రీన్ బెల్ట్ సభ్యులు ఎస్‌వి రమణమూర్తి అన్నారు. మండలంలోని లచ్చయ్యపేట ఎఐఎం ఫర్ సేవా సంస్థలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటితే వాతావరణంలో మార్పులు తీసుకురావచ్చన్నారు. అలాగే అక్కడ ఉన్న పిల్లలకు టిఫిన్లు, భోజనాలను ఏర్పాటు చేశారు. వారికి ప్రతి ఆదివారం ఆటపాటలతో చేసే కార్యక్రమం చేస్తామన్నారు.కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ సభ్యులు రామనాయుడు, యోగా టీచర్ సన్యాసినాయుడు, నాగేశ్వరరావుతో పాటు సేవా సంస్థ సభ్యులు పి.శ్రీనివాసరావు, సిహెచ్ రవి, రాజా, నల్ల రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకూడదా? : టిడిపి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని కరాసువలస కెజిబివి పాఠశాలలో గతంలో పనిచేసిన వంట పని వారు విద్యార్థులకు సరిపడా భోజనాలను అందించకుండా ఇబ్బందులు పాలుజేస్తే వారిపై చర్యలు తీసుకోకూడదా అని మండల టిడిపి నాయకులు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. విద్యార్థుల ఇబ్బందులపై వారి తల్లిదండ్రులు మంత్రి సంధ్యారాణి ఫిర్యాదు చేశారన్నారు. దీంతో మంత్రే పాఠశాలను సందర్శించగా, అక్కడ విద్యార్థులు, తల్లిదండ్రులు చెప్పిన విధంగానే సరైన వంటలు చేయకుండా చాలీచాలని భోజనాలు, కూరలను వడ్డించడాన్ని గమనించారని, దీంతో వెంటనే వారిపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారని అన్నారు. అధికారుల విచారణలో వాస్తవాలు నిగ్గు తేల్చగా వారిని సస్పెన్షన్ చేశారన్నారు. దీంతో అక్కడి విద్యార్థులకు వంట చేయడానికి తక్షణమే ఎవరినైనా నియమించాలని అధికారులను నిరుపేదలైన వారికి అవకాశం కల్పించామని తెలిపారు. వారి నుంచి డబ్బులు వసూలు చేశామని కొన్ని దినపత్రికల్లో నిరాధారమైన ఆరోపణలతో కథనాలను రాశారని, ఇది ఎంతవరకు సబబుని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆశాలు, అంగన్వాడీలు, హెల్పర్లు, షిఫ్ట్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఉద్యోగాలను నియమించామని, ఏ ఒక్కరి నుంచి రూపాయి ఆశించకుండా పేదలైన వ్యక్తులకే ఆ ఉద్యోగాలకు ఎంపిక చేసామని తెలిపారు. అటువంటిది రోజువారి కూలిగా ఇచ్చే వంట పనివారి వద్ద డబ్బులు తీసుకుని ఉద్యోగాలను వేశామని నిరాధార ఆరోపణ చేయడం భావ్యం కాదన్నారు. విలేకరుల సమావేశం పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, కౌన్సిలర్ హర్ష, నాయకులు అప్పికొండ రమాదేవి, యుగంధర్, కూనిశెట్టి భీమారావు, డొంక అన్నపూర్ణ గణపతి లింగాల గాంధీ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కెజిబివి ఎస్‌ఒ సస్పెన్షన్‌పై విచారణ నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో సుపరిపాలన ఎక్కడా కనిపించడం లేదని రాజ్యాంగ బద్ధంగా అధికారులు పరిపాలన చేయడం లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జిలు గేదెల రామకృష్ణ, బత్తిన మోహన్‌రావు, ఒబిసి జిల్లా ఛైర్మన్ వి.దాలినాయుడు విమర్శించారు. ఆదివారం స్థానిక విలేకర్లతో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి జిల్లాలో పాలనాపరమైన వ్యవహారాలపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా చిన్న, చిన్న ఉద్యోగుల తొలగింపు, కొత్త వారి నియామకం, బదిలీల వ్యవహారంలో పలువురు కూటమి నాయకుల జోక్యం పెరిగిందని చెప్పారు. గత కొద్ది రోజులుగా సాలూరు మండలం కరాసువలస కెజిబివి స్పెషలాఫీసర్ ప్రశాంతితో పాటు నలుగురు వంటమనుషుల సస్పెన్షన్‌లో సాక్షాత్తు జిల్లా మంత్రి ప్రమేయం ఉందని చెప్పారు. మంత్రి ఆదేశం చారని జిల్లా కలెక్టర్ కెజిబివి ఎస్ఒ ప్రశాంతి సహా సిబ్బంది ని సస్పెండ్ చేయడం కూటమి పాలనకు నిదర్శనమని ఆరోపించారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఉపాధి, వెలుగు, మధ్యాహ్న భోజనం, మోడల్, కెజిబివి పాఠశాలల్లో చిరు ఉద్యోగుల తొలగించడం, వారి స్థానంలో కొత్త నియామకాలు చేయడంలో పలువురు నేతలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఉద్యోగుల సాధారణ బదిలీలు, ఇటీవల జరిగిన గెస్ట్ ఫ్యాకల్టీ నియామ కాల్లో పాలకులు సిఫార్సు లేఖలు ఇవ్వటం, ఫోన్లు చేయటం సిగ్గుచేటని అన్నారు. కరాసువలస కెజిబివి ఎస్ఓ ,సిబ్బంది సస్పెన్షన్ వ్యవహారం పై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తీళ్ళ శంకరరావు పాల్గొన్నారు.

అంపిలిలో జోరుగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని అంపిలిలో అనధికారికంగా ఇసుక జోరుగా అక్రమంగా తరలిపోతుంది. దీంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన కరకట్టలు కూడా పాడైన స్థితిలో చేరుకున్నాయి. కరకట్లు పూర్తిగా పాడైతే దాని ప్రభావం కూడా ఎక్కువ అయ్యే పరిస్థితి కనిపిస్తుంది. అయినప్పటికీ ఇసుక అక్రమార్కులు లెక్కచేయడం లేదు. రోజుకు వందలాది నాటు బళ్లు, టాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. అయినా సంబంధిత అధికారుల ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారు. నాటు బళ్లకు వంద రూపాయలు నుంచి 200 రూపాయలు వరకు వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.400 నుంచి రూ.500 వసూలు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ట్రాక్టర్ల ద్వారా, పగటి పూట నాటు బళ్ల తో అంపిలి రహదారి రద్దీగా కావడంతో స్థానికులు కూడా తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి కరకట్టలకు ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నాటుబళ్లతో తరలిపోతున్న ఇసుక

చినుకు పడితే ఇంతే!

వీరఘట్టం: వీరఘట్టం- చలివేంద్రి గ్రామాల మధ్య రోడ్డు చిన్నపాటి చినుకు పడినా కాలువను తలపిస్తుంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పంట పిల్ల కాలువలు అక్రమణదారులు కప్పి వేయడంతో వర్షం పడిన ప్రతిసారి రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించ చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జక్కరవలసలో పులి సంచారం?

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో జక్కరవలస పరిసర ప్రాంతాల్లో పులి ఆకారంలో ఉన్న జంతువు సంచరిస్తుందని చుట్టుపక్కల గ్రామాల గిరిజనులు భయం ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో పులి గాండ్రింపు లాగా వినిపించిందని గ్రామస్తులు తెలపడంతో ఆందోళన మొదలైంది.

ప్రభుత్వం దృష్టికి సిహెచ్‌డబ్ల్యుల సమస్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బి.విజయ్ చంద్రను కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు కోరారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమకు వేతనాలు పెంచాలని, ఆశా వర్కర్ల మాదిరిగానే తాము కూడా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని, అయినా అరకొర వేతనాలు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు వేతనాలు పెంచాలని, యూనిఫామ్‌లు అందించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు